క్లుప్తంగా

రుణ అర్హత ధ్రువీకరణ పత్రాలు మంజూరు

శావల్యాపురం: ఖరీఫ్ సాగుకు అర్హత కలిగిన సన్న చిన్నకారు కౌలు రైతులందరికీ రుణ అర్హత ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు వెల్లడించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో రెవెన్యూ వ్యవసాయ అధికారుల సంయుక్తంగా దరఖాస్తు చేసుకున్న రైతులకు క్షేత్రస్థాయిలో విచారణ చేసిన అనంతరం రుణ అర్హత ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు. ఈక్రమంలో భాగంగా అన్నీ రైతు భరోసా కేంద్రాల్లో గ్రామసభలు నిర్వహించి అర్జీలు స్వీకరించే కార్యక్రమం చేపడతామన్నారు. గత ఏడాదిలో 1600 ధ్రువీకరణ పత్రాలు కౌలు రైతులకు ప్రభుత్వ పరంగా మంజూరు చేశామని, ఈ ఏడాదిలో 2 వేలు ఇచ్చేలా లక్ష్యంగా ఏంచుకున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ చంద్రబాబులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా వెంకటేశ్వరరావు



నరసరావుపేట రూరల్: ఎంపీడీఓగా ఎస్.వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీలో ఏవోగా పనిచేసిన వెంకటేశ్వరరావు పదోన్నతిపై నరసరావుపేట ఎంపీడీఓగా వచ్చారు. గతంలో ఎంపీడీఓగా పనిచేసిన బూసిరెడ్డి పదోన్నతిపై డ్వామా ఏపీడీగా వినుకొండ వెళ్లారు. అప్పటి నుంచి నరసరావుపేట ఎంపీడీవో కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కొనసాగుతున్నారు. ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును డ్వామా ఏపీడీ బూసిరెడ్డి, ఏవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ విజయ కుమార్, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

ఈశ్వర్ విద్యార్థికి గోల్డ్‌మెడల్



నరసరావుపేట రూరల్: ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విద్యార్థి నారదాసు మహేష్‌బాబు గోల్డ్‌మెడల్ సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 31వ తేదీన నిర్వహించిన జేఎన్‌టీయూ కాకినాడ స్నాతకోత్సవంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు చేతుల మీదగా గోల్డ్‌మెడల్ అందుకున్నట్టు తెలిపారు. వరుసగా నాల్గవసారి కళాశాలకు గోల్డ్‌మెడల్ రావడం గర్వకారణంగా ఉందన్నారు. గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థి నారదాసు మహేష్ బాబును కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీం మొహిద్దీన్, డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

వినుకొండలో 12న వేలంపాట

వినుకొండ(నూజెండ్ల) : పట్టణంలోని కొండపైన వేంచేసిన శ్రీ రామలింగేశ్వరస్వామి వారి తొలి ఏకాదశి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని కొండపైన కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పలు, ప్రసాదములు, వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ అమ్ముకొనుటకు ఈ నెల 12వ తేదీన వేలంపాట నిర్వహించడం జరుగుతుందని కార్యనిర్వాహక అధికారి కె.హనుమంతరావు తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ధరావత్తు చెల్లించాలని, ఈ వేలంపాట పట్టణంలోని శ్రీ ప్రసన్న రామలింగేశ్వర, కోదండ రామస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వేలంలో పాట దక్కించుకున్న వారు ఈ నెల 29వ తేదీ తిరునాళ్ల రోజు మాత్రమే విక్రయించుకునేందుకు వీలుంటుందని తెలిపారు.

ఏపీఎం బదిలీ

నాదెండ్ల: మండల వైఎస్సార్ క్రాంతిపథం (డీఆర్‌డీఏ) ఏపీఎం భరత్ బదిలీ అయ్యారు. నరసరావుపేట రూరల్ మండలం డీఆర్‌డీఏ ఏపీఎంగా చేరనున్నారు. గత నాలుగేళ్లగా నాదెండ్ల మండలంలో ఆయన విధులు నిర్వహించారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఉప్పరపాలెం గ్రామంలో గడపగడపకు కార్యక్రమం



ఉప్పరపాలెంలో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో సంక్షేమ పత్రాలు అందజేస్తున్న మంత్రి రజిని

యడ్లపాడు: ఇంటింటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. కార్మికులు గ్రామమైన ఉప్పరపాలెంలో బుధవారం గడపగడపకు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రజినిని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. 16 నంబర్ జాతీయ రహదారి నుంచి మంత్రి రజినిని ర్యాలీగా గ్రామంలోని తీసుకువచ్చారు. గ్రామంలోని ఎస్సీకాలనీలోకి వెళ్లి భారత రాజ్యంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్, మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి మంత్రి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి చర్చిలో ప్రార్థనలు చేశారు. వెనువెంటనే గడపగడపకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటి కార్యక్రమంలో భాగంగా తమ ముందుకు వచ్చిన రజినిని మహిళలు హారతులిచ్చి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆయా కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలను తెలిపే బుక్‌లెట్‌ను అందజేస్తూ.. ఆప్యాయంగా పలకరించారు. జగనన్న పాలనలో తమకు ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలలు గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులందరికీ చేరాయని మంత్రి ఎదుట మహిళలు సంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే గ్రామంలోని సమస్యల గురించి మంత్రి ఆరా తీశారు.

ప్రతి గుండెలోనూ సంక్షేమ స్పందనే: మంత్రి రజిని

గడపగడపలో భాగంగా ఏ ఇంటికి వెళ్లినా ప్రజల మనసుల్లో సంక్షేమ స్పందన స్పష్టంగా వినిపిస్తోందని మంత్రి విడదల రజిని తెలిపారు. నవరత్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ఆనందం తొణికిసలాడుతుందన్నారు. విద్య, వైద్యం, సాగు రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. విద్య రంగంలో విప్లవాత్మక మార్పుల్ని తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా మారి, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నిలుస్తున్నాయన్నారు. అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, వైఎస్సార్ కానుక, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి కార్యక్రమాలతో విద్యారంగాన్ని అగ్రభాగాన నిలిపారన్నారు.

మండల వాసుల చిరకాల వాంఛ నెరవేర్చాం...

యడ్లపాడు వాసులు చిరకాల కోరికైన జెడ్పీ హైస్కూల్ భవన నిర్మాణం చేసి అందులోనే బాలికలకు ఇంటర్ విద్యను అందించే విధంగా జూనియర్ కళాశాలను తీసుకువచ్చామన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పేద కుటుంబాలల్లోని బాలికలు పదో తరగతితోనే వారి విద్య నిలిచిపోకూడదనే ఉద్దేశంతో జగనన్న ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసిందన్నారు. తమ పిల్లలను తప్పకస్థానిక కళాశాలలో చేర్పించి ఉచిత ఉన్నత విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, సోసైటీ చైర్మన్‌లు బసెల శివరామకృష్ణ, పూర్ణయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంటా శంకర్, సింగారెడ్డి కోటిరెడ్డి, రాచమంటి చింతారావు, సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, న్యాయవాది దాసరి చిట్టిబాబు, పార్టీ నాయకులు జంగా ప్రసన్న, శ్రీనివాసరావు, అల్లాబక్షు, గుత్తి సింగయ్య, ఎ.శ్యాంపాల్, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, షేక్ ఖాదర్‌బాష, సీతారామయ్య, షేక్ జాకీర్, పావులూరి వాసు, మాదం శ్రీను, కర్నాట సుబ్బారావు, గౌరు హనుమంతరావు, వంకాయలపాడు ఆనంద్ కుమార్, వి.శ్రీనివాసనాయక్, ఉప్పారపాలెం నాయకులు పల్లపు లక్ష్మీనారాయణ, గ్రామపార్టీ అధ్యక్షుడు పల్లపు రవి, పల్లపు ముసలయ్య, అంకమ్మబాబు, వల్లెపు చక్రవర్తి, పల్లపు మంగయ్య, పానకాల మంగయ్య, అచ్చి శ్రీను, విప్పర్ల దేవసహాయం, కర్రా ప్రభాకరరావు, మెడబలిమి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుట్లపల్లిలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బొల్లా

బొల్లాపల్లి: మండలంలోని గుట్లపల్లి గ్రామంలో పట్టాభిరామయ్య ఆంజనేయస్వామి నూతన విగ్రహ, బొడ్రాయి, ప్రతిష్టా మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. వేకువజాము నుంచే ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా పలు రకాల ప్రత్యేక పూజలు, అభిషేకాలను వేద పండితులు నియమ నిష్ఠలతో చేశారు. ఈ ప్రతిష్టా కార్యక్రమానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైఎస్సార్ సీపీ నేత మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ప్రతిష్టా కార్యక్రమానికి హాజరైన ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ గ్రామాల నుంచి ఆడపడుచులు, బంధువులు విచ్చేయడంతో గ్రామంతా కళకళలాడింది.

కొండ్రముట్లలో...

ఈపూరు: మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో అభయ ఆంజనేయస్వామి, గణపతి, బొడ్డురాయి, నాభిశిల, శిఖర కలశ, కీర్తి ధ్వజం జీవ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్టించారు. మహోత్సవాన్ని కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, గ్రామపెద్దలు ఎమ్మెల్యే బొల్లాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం

శావల్యాపురం: మాతా శిశు మరణాల నియంత్రణకు గర్భిణులు పోషకాలు కల్గిన మంచి ఆహారాన్ని తీసుకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం అన్నారు. బుధవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆహార భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లి పాలు తాగిన శిశువులో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలనీ, వ్యాధుల బారిన పడకుండా ఉండటానికి చిరుధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, తదితర పోషకాలు కల్గినవన్నీ క్రమం తప్పకుండా గర్భిణులు తీసుకోవటం ద్వారా తల్లిబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఈసదస్సులో సీహెచ్‌వో వెంకటయ్య, సూపర్‌వైజరు ఏడుకొండలు, స్టాఫ్‌నర్సులు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ప్రమీల, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదరెడ్డిపాలెంలో పునీత అంతోని దేవాలయం ఆరంభం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నరసరావుపేట రూరల్: మండలంలోని పెదరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మించిన పునీత అంతోని దేవాలయం ఆర్‌సీఎం చర్చి ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగయ్య, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వంపుగుడి జాన్, వెంకటనరసయ్య, చినసుబ్బారావు, సుధాకరరెడ్డి, కృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా శనీశ్వర ఆలయ వార్షికోత్సవం



హోమాల్లో పాల్గొన్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ రూరల్ మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలో జ్యేష్ఠ లక్ష్మీ సమేత శనీశ్వర స్వామి దేవస్థానంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, అభిషేకములు, గణపతిపూజ, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ రుద్ర హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ వార్షికోత్సవ వేడుకల్లో భక్తులు పాల్గొనాలని జానపాటి పరమేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ సభ్యులు కూరాకుల రాము, రేవెళ్ల శ్రీనివాసరావు, సాయికుమార్, అశోక్‌రెడ్డి, వరప్రసాద్, రాఘవరావు, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

నూతన మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్



కమిషనర్‌ను సన్మానించిన లైసెన్స్‌డు ఇంజినీర్ల అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట: మున్సిపల్ కమిషనర్‌గా కష్టపడి పనిచేసి పట్టణాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని కమిషనర్ ఎ.రామ్మోహన్ పేర్కొన్నారు. నూతన కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన విషయం విదితమే. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిరోజూ ఉదయాన్నే పట్టణంలో పర్యటిస్తానని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. కాగా, ఏపీ లైసెన్స్‌డు ఇంజనీర్స్, సర్వేయర్ల సంక్షేమ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కొమ్మసాని కమలాకర రెడ్డి ఆధ్వర్యంలో ఇంజినీర్లు కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. తమ వృత్తిలో ఉన్న సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు.

కమిషనర్ మాట్లాడుతూ లైసెన్స్‌డ్ ఇంజినీర్లకు వృత్తిపరంగా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టణ ప్రణాళిక విభాగ అధికారి ఎం.వి.నరసింహా రావు, గుంటూరు జిల్లా ఇంజినీర్స్ సంఘం ఉపాధ్యక్షుడు బి.వెంకట నారాయణ, ఇంజినీర్స్ సంఘ కార్యదర్శి బి.శ్రీనివాస సింగ్, కోశాధికారి జి.అనిల్, ఎస్.లక్ష్మీకాంత్, వి.వేణుగోపాల్, జీపీ రంగయ్య, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



రాష్ట్ర నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

నరసరావుపేట: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఉద్యోగస్తులందరినీ పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సీఐటీయు నాయకులు కోరారు. ఈ డిమాండ్ మేరకు గత నెల 31వ తేదీన సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి ప్రారంభమైన రాష్ట్ర మున్సిపల్ ప్రచారజాత బుధవారం నరసరావుపేట పట్టణానికి చేరుకుంది. నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు బైక్‌ర్యాలీ నిర్వహించి మున్సిపల్ జాతకు ఘనస్వాగతం పలికారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సిలార్ మసూద్ అధ్యక్షత వహించారు. సభకు నరసరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల మున్సిపాలిటీల నుంచి కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. జాతాలో వచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం, రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేంద్రబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏటీఎం నాగరాజు, ఎస్.లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు బి.ఆదినారాయణ ఎస్.రవి ప్రజానాట్యమండలి కళాకారులు కృష్ణవేణి, పుల్లయ్య, రామాంజనేయులు. హరిలను పూలమాలలతో సత్కరించారు. మున్సిపల్ కార్మికులు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాలను రాష్ట్ర అధ్యక్షులకు అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె. హనుమంతరెడ్డి, జిల్లా కోశాధికారి డి.శివకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్, సహాయ కార్యదర్శులు మల్లేశ్వరి, తెలకపల్లి శ్రీను సీఐటీయూ జిల్లా నాయకులు హుస్సేన్, మస్తాన్‌వలి, మున్సిపల్ యూనియన్ నాయకులు మల్లయ్య, సాల్మన్ పాల్గొన్నారు.

హోంగార్డుల ఐక్యత ప్రశంసనీయం

- జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి
- హోంగార్డుకు రూ.5.30 లక్షలు అందజేసిన తోటి హోంగార్డులు



హోంగార్డు దంపతులకు చెక్కు అందజేస్తున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: హోంగార్డుల ఐకమత్యం ప్రశంసించదగిన విషయమని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన హోంగార్డు ఎల్‌వీహెచ్ ప్రసాదుకు జిల్లాలోని హోంగార్డులు ఒకరోజు వేతనంగా చేసిన ఆర్థికసాయం రూ.5.30 లక్షల చెక్కును అందజేశారు. తెనాలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ప్రసాదు ఇటీవల పదవీ విరమణ పొందారు. అతడికి తోటి హోంగార్డులు అండగా నిలిచి ఒకరోజు వేతనం రూ.5.30 లక్షల సాయం ప్రకటించారు. సాటి హోంగార్డుకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన హోంగార్డులను జిల్లా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్.ఐ వై.రవికిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం



నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఉదయం వైభవంగా జరిపించారు. వేదపండితుల నిర్ణయించిన ముహూర్తాన స్వామివారి బింబ, ఆలయశిఖరం, జీవధ్వజదండ ప్రతిష్టించారు. ఆలయం వద్ద ధ్వజ స్తంబం ప్రతిష్టిస్తుండగా భక్తులు స్వామివారి నామ స్మరణలో మునిగిపోయారు. ప్రతిష్ట అనంతరం లోకకల్యాణం, గ్రామ శ్రేయస్సు కోసం విశేషపూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి విశేషపూజల్లో పాల్గొన్నారు. పలుగ్రామాల నుంచి తరలివచ్చిన విశేష అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిస్తేనే...

- వందశాతం అక్షరాస్యత
- నల్లగార్లపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు

రొంపిచర్ల: సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన జరిగితేనే వందశాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని న్యాయవిజ్ఞాన సదస్సు ప్యానెల్ న్యాయవాదులు అచ్చి ఏడుకొండలు, శ్రీరామినేని ప్రసాద్ పేర్కొన్నారు. నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ.నాగేశ్వరావు ఆదేశాల మేరకు బుధవారం రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామ సచివాలయంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టంపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి పారాలీగల్ వలంటీర్ గోదా రమేష్ కుమార్ సభాధ్యక్షత వహించారు. ప్యానెల్ న్యాయవాదులు మాట్లాడుతూ 14 ఏళ్ల వయస్సులోపు గల వారిని పనులకు పంపకూడదని వివరించారు. వారిని పనులకు పెట్టుకునే వివిధ సంస్థల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. గ్రామసర్పంచ్ కట్టా వెంకటరెడ్డి రాజేశ్వరి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో జగన్‌మోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీస్, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలలో బదిలీలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా పరిధిలోని 28 భవిత కేంద్రాలలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీలకు బదిలీల ప్రక్రియ చేపడుతున్నట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కె.శామ్యూల్ బుధవారం తెలిపారు. భవిత సిబ్బంది తమ బదిలీ దరఖాస్తును ఈనెల 8వతేదీ గురువారం సాయంత్రం 5 గంటలలోగా కార్యాలయంలో అందచేయాలని తెలిపారు. దరఖాస్తులను 9వతేదీన పరిశీలించి 10వ తేదీన బదిలీ ఉత్తర్వులు అందచేస్తామని వివరించారు. ఆరోగ్యపరమైన సమస్యలతో బదిలీ కోరుకునే వారు తమ దరఖాస్తుతో పాటు ఆరు నెలల లోపు ఉన్న మెడికల్ రిపోర్టులను తప్పనిసరిగా జత చేయాలని సూచించారు.

తహసీల్దార్‌గా సురేష్

సత్తెనపల్లి: సత్తెనపల్లి తహసీల్దార్‌గా ఎస్.సురేష్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నకరికల్లు తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు రానున్నారు.

పాఠశాలలకు జగనన్న విద్యాకానుకలు



స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ నుంచి జగనన్న విద్యాకానుక కిట్లు మండలంలోని మతుకుమల్లి, కారుమంచి పాఠశాలల సముదాయాలకు వాహనంలో తరలించే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో పాఠ్యపుస్తకాలు, బ్యాగ్స్, సమదుస్తులు బెల్టులు తదితర విద్యాసామగ్రి ఉన్నాయని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు వెల్లడించారు.

–శావల్యాపురం

చెరువుల అభివృద్ధి

అమృత్ సరోవర్ పథకం కింద చెరువులను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార్ రాజా అన్నారు. నూజెండ్ల మండలంలోని కె.కొత్తపాలెం, తెల్లబాడు, ఉప్పలపాడు, రాముడుపాలెం తండా గ్రామాల్లో చెరువులను ఆయన పరిశీలించారు. త్వరలోనే పనులు ప్రారంభించి చెరువులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో కట్టా నాగేశ్వరరావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

